క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు భక్తులు, ఉభయదాతలు సేవలో పాల్గొన్నారు. సేవ అనతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సూర్య భగవానుడిని ఆరాధించడం వల్ల ఆరోగ్య సిద్ధి, ఐశ్వర్యం, ఆయుష్షు వృద్ధి చెందుతాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీగంగానమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మహిళలచే కుంకుమ పూజలు శాస్త్రోక్తంగా చేయించారు. అనంతరం మహిళలు అమ్మవారికి లలితా సహస్రనామ పారాయణం, శ్రీగంగానమ్మ చాలీసా, గంగానమ్మ అష్టోత్తరం చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మందపాటి యుగంధర్ వర్మ మాట్లాడుతూ తాము ప్రతి పౌర్ణమికి లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు గొడవర్తి నరేంద్రవర్మ, ఉప్పలపాటి మురళీ కృష్ణంరాజు, ఉప్పలపాటి సత్యనారాయణరాజు పర్యవేక్షించారు.

అన్నదాత పోరుకు తరలిరండి

వైఎస్సార్ సీపీ చేతి వృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ నెల 9న తలపెట్టిన అన్నదాత పోరుకు తరలి రావాలని వైఎస్సార్ సీపీ చేతి వృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు తోలేటి శ్రీకాంత్ ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో భాగంగా యూరియా, ఎరువుల కొరతపై ఆర్డీఓలకు వినతి పత్రం అందించే కార్యక్రమానికి రైతులు, ప్రజలు వచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల వ్యతిరేకి చంద్రబాబు అన్న నినాదం మరోమారు రుజువయ్యిందని అన్నారు. వ్యవసాయం దండుగ అన్న చంద్రబాబుకు రైతుల కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. రైతులను అవహేళన చేస్తూ వ్యవసాయ మంత్రి అచ్చెంనాయుడు చేసిన వ్యాఖ్యలు దారుణమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి పెట్టుబడిదారులు తప్ప రైతులు కనబడటం లేదని ఎద్దేవా చేశారు. యూరియా, ఎరువుల కోసం రోడ్డుపైకి వచ్చి క్యూ లైన్లలో నిలబడి రైతులు అవస్థలు పడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని విమర్శించారు. రైతులకు అండగా నిలబడింది జగనన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్కటేనని స్పష్టం చేశారు.

మధురంగా సాగిన సంగీత కచేరి



విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు ముద్దులపల్లి లక్ష్మీనారాయణ సంస్మరణ సందర్భంగా ఆదివారం దుర్గాపురం శివరామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో సంగీత విద్వాంసుడు ఎస్సీ రంగాచార్యులు నిర్వహించిన గాత్ర సంగీత సభ శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన వల్లభనాయక, త్యాగరాజస్వామి కీర్తన శ్రీనారద, దొరుకునా ఇటువంటి సేవ, ఎస్సీహెచ్ కృష్ణమాచార్యులు రచన గౌరీ సుకుమారి కీర్తనలను మధురంగా ఆలపించారు. పాలపర్తి నాగేశ్వరరావు, మంగళగిరి శ్రీధర్, మార్టూరి హరిబాబులు వాద్య సహకారం అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు ఎస్సీహెచ్ బుచ్చయ్యాచార్యులు మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతం నిరంతరం ప్రవహించే గంగా ప్రవాహమన్నారు. రంగాచార్యులు సంగీత సేవకే అంకితమయ్యారని పేర్కొన్నారు. అనంతరం సంగీత విద్వాంసుడు రంగాచార్యులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, ముద్దులపల్లి సత్యనారాయణమూర్తి, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

అన్నదాత పోరు విజయవంతం చేయండి

- ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు అండగా ఉన్న కూటమి సర్కార్
- బాబు పాలనలోనే రైతులు రోడ్డున పడుతున్నారు
- రైతాంగానికి అండగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రైతులకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ నెల తొమ్మిదో తేదీన చేపట్టిన అన్నదాత పోరును విజయవంతం చేయాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎరువుల కొరత, కూటమి వ్యవసాయరంగంలో అనుసరిస్తున్న అసమర్థ విధానాలకు వ్యతిరేకంగా అన్నదాతలతో కలిసి తమ పార్టీ పోరు కార్యక్రమాన్ని చేపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి అన్నదాతపోరు పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. వెలంపల్లి మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారి ఆవేదనపై గళం విప్పే విధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిదో తేదీన ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతి పత్రాలు అందిస్తామని చెప్పారు. నందిగామ నియోజకవర్గంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద రైతులు, పార్టీ నాయకులతో కలిసి ఆర్డీఓకి వినతి పత్రం అందిస్తామని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు రోడ్లపైకి వచ్చి ఎరువుల కోసం రోజులు తరబడి క్యూలైన్లలో పడిగాపులు కాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు హయాంలోనే రైతులు ఇబ్బందులు పడతారనడానికి ఇది ఒక నిదర్శనమన్నారు. చంద్రబాబు రైతుల పక్షపాతి కాదని పెత్తందారులే ఆయనకు కనపడతారన్నారు. ఎరువుల కోసం రైతులు లైన్లలో నిలబడుతున్నారని చెబితే భోజనాల కోసం లైన్‌లో నిలబడరా అని రైతులను అవహేళన చేసే విధంగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు మాట్లాడటం దారుణమని చెప్పారు. అటువంటి వ్యక్తి వ్యవసాయశాఖ మంత్రిగా ఉండడం మన దౌర్భాగ్యమన్నారు.

ఆర్బీకేలు నిర్వీర్యం....

గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విత్తనం నుంచి విక్రయం దాకా ఆర్బీకే కేంద్రాల ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిపాలన జరిపారన్నారు. చంద్రబాబు ఆర్బీకేలను నిర్వీర్యం చేశారన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్లో అమ్ముకోవడం కోసమే ఈ విధంగా చేశారని ధ్వజమెత్తారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు మొన్న అన్నదాత సుఖీభవలో సైతం రైతులకు వ్యతిరేకంగా మాట్లాడారన్నారు. చంద్రబాబు హయాంలో ఏ పంటకీ మద్దతు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి వైఫల్యాలను ఎండగడుతూ రైతులకు వైఎస్సార్ సీపీ అండగా నిలబడుతుందని చెప్పారు. అన్నదాతపోరుకు పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, శిరంశెట్టి పూర్ణ, కోటిరెడ్డి, ఆంజనేయరెడ్డి, మండేపూడి ఛటర్జీ, గోదావరి గంగ నాయకులు తంగెళ్ల రామచంద్రరావు, తుపాకుల గురుమూర్తి, గోదావరి బాబు, బంకా విజయ, శంకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



సీఐ కిషోర్‌బాబు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రహదారులపై సురక్షితంగా ప్రయాణించడం కోసం ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి అని మూడవ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్‌బాబు తెలిపారు. ఆదివారం సత్యనారాయణపురంలోని మూడవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో రోడ్డు భద్రత, మోటరు వాహనాల చట్టాలపై ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడ కమిషనరేట్ పరిధిలో ముఖ్యంగా నగరంలోని అన్ని ప్రధాన రహదారులపై సీసీ కెమెరాలు అమర్చబడి నిరంతరం పనిచేస్తున్నాయన్నారు. వాటి ద్వారా ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనను స్పష్టంగా గుర్తించి, సంబంధిత వాహనదారులపై చలానాలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిబుల్ రైడింగ్, వన్-వే అతిక్రమణ, ఫ్రీ లెఫ్ట్ ఉల్లంఘన, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి వాటిపై చలానాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే హెల్మెట్ కేవలం చలానాల నుంచి తప్పించుకోవడానికి కాకుండా తమ జీవితానికి రక్షణగా భావించాలని సూచించారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పురాతన గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలి!

- 1926లో ప్రారంభించిన గాంధీ పార్క్ గ్రంథాలయం
- కొద్ది కాలం క్రితం మూసివేసిన వైనం
- సంతకాల సేకరణ చేసి అధికారులకు విజ్ఞప్తి



సంతకాల సేకరణ చేస్తున్న అభివృద్ధి కమిటీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని పురాతన గాంధీ పార్క్ గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలంటూ పశ్చిమ నియోజకవర్గ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. నగరంలో పురాతన పార్కుల్లో ఒకటైన గాంధీపార్క్ ప్రాంగణంలో సుదీర్ఘ కాలం పాటు గ్రంథాలయం కొనసాగింది. గ్రంథాలయం కోసం ప్రత్యేకంగా ఒక ప్రాంగణాన్ని సైతం ఏర్పాటు చేసి దానిని నిర్వహించేవారు. గాంధీ పార్క్ అభివృద్ధి పేరుతో గ్రంథాలయాన్ని పూర్తిగా తొలగించి వేయటంతో కొద్ది సంవత్సరాలుగా సందర్శకులు దీనిపై అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అయినా గ్రంథాలయ పునరుద్ధరణకు అధికారులు స్పందించిన దాఖలాలు లేవు.

విజయవాడ నగరంలో ప్రజల ఆహ్లాదానికి 1926వ సంవత్సరంలో అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ పాలకులు పార్కును ఏర్పాటు చేశారు. స్వాతంత్రోద్యమంలో ఆ పార్క్‌కు గాంధీ పార్క్‌గా నామకరణం చేశారు. అదే సంవత్సరం నగర ప్రజలకు విజ్ఞానం అందించేందుకు నాటి బ్రిటీష్ పాలకులే గాంధీ పార్క్ ప్రాంగణంలో ఒక ప్రత్యేక ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి అందులో గ్రంథాలయాన్ని స్థాపించారు. ఈ గ్రంథాలయంలో అన్ని దినపత్రికలతో పాటుగా కొన్ని మాస, పక్ష పత్రికలు సైతం వచ్చేవి. ఈ గ్రంథాలయంలో సుదీర్ఘ కాలం కొనసాగింది. కొద్ది సంవత్సరాల క్రితం దానిని పార్క్ అభివృద్ధి పేరుతో మూసివేశారు. అంతేకాకుండా దానిని స్టోర్‌రూమ్‌గా మార్పు చేసి వాడటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

గాంధీపార్క్‌లో గ్రంథాలయం పునర్ధణ కోసం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ పేరుతో సందర్శకులు ఒక కమిటీగా ఏర్పడి దీని కోసం కృషి చేస్తున్నారు. ఇటీవల పార్కులో గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలంటూ సంతకాల సేకరణ చేపట్టారు. ఆ కమిటీ కన్వీనర్ ఏ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయానికి వినియోగించే ప్రాంగణాన్ని స్టోర్ రూమ్‌కు వినియోగించటం దారుణమన్నారు. గ్రంథాలయం పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎంతో పురాతనమైన గ్రంథాలయాన్ని మూసివేయటం సరికాదని పేర్కొన్నారు.

చవితి ఉత్సవాలపై అడ్డగోలు ఆంక్షలు



మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వినాయకచవితి ఉత్సవాలపై కూటమి ప్రభుత్వం అడ్డగోలు ఆంక్షలను విధించి హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు వినాయక చవితికి ఆంక్షలు లేవని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు కళ్లు ఆర్పకుండా అబద్ధాలు చెప్పగలరన్నారు. వినాయచవితి మహోత్సవాల్లో ఎన్ని పందిళ్లలో కరెంటు ఉచితంగా ఇచ్చారో చంద్రబాబు చెప్పాలన్నారు. ఊరేగింపు అంటే ప్రతిఒక్క మండపందారుడు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని, తరతరాలు ఇదే సంప్రదాయంగా కొనసాగుతూ వచ్చిందన్నారు. ఎన్నడూ లేని విధంగా రాత్రి పది గంటలకే మైక్‌లు, లైట్లు ఆపేస్తున్నారని, లాప్‌టాప్‌లు లాక్కొని నిర్వాహకులను పోలీసులు నిర్బంధిస్తున్నారన్నారు. రాత్రి 12 గంటల దాకా బార్లు ఉండడానికి అన్ని అనుమతులు ఇచ్చారని, వినాయక చవితి ఊరేగింపులు మాత్రం పది గంటలకే ఆపాలనడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని కూటమి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. గ్రహణం కారణంగా వినాయకచవితి పందిళ్లను తీసివేయాలని పోలీసులు బెదిరిస్తున్నారని చెప్పారు. వినాయక చవితి పందిళ్లు ఉంచాలా తీసెయ్యాలా అని చెప్పటానికి పోలీసులు ఎవరు అని ప్రశ్నించారు. గ్రహణం అయితే సంప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. పోలీసులు ఇబ్బంది పెట్టని పందిళ్లు ఏమైనా ఉన్నాయా అన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేవిధంగా చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. సనాతన ధర్మం బ్రాండ్ అంబాసడర్ పవన్ కల్యాణ్ వినాయకచవితిలో పాల్గొన్నట్టు ఎక్కడా కనపడలేదన్నారు. ఈ సమావేశంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, శిరంశెట్టి పూర్ణ, కోటిరెడ్డి, ఆంజనేయరెడ్డి, మండేపూడి ఛటర్జీ, గోదావరి గంగ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విధానాలపై గళం విప్పాలి

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు



పదవులు పొందిన నేతలను సత్కరిస్తున్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల్లో పదవులు పొందిన నేతలు కూటమి ప్రజా వ్యతిరేక విధానాలపై గళం విప్పాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాలకు వివిధ పదవుల్లో నియమితులైన నాయకులు, నియోజకవర్గ అనుబంధ విభాగల అధ్యక్షులు వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి వారిని శాలువాతో సన్మానించారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వెలంపల్లి శ్రీనివాసరావును కలిసిన వారిలో పశ్చిమ ఆర్టిసన్ సెల్ అధ్యక్షురాలు అండలూరి లత, ఎన్టీఆర్ జిల్లా పార్టీ మైనారిటీ విభాగ కార్యదర్శి షేక్ గౌస్, వైఎస్సార్ టీయుసీ కార్యదర్శులు రెడిపాంగు క్రాంతికుమార్, సోమిశెట్టి వెంకటేశ్వరరావు, మునిసిపల్ విభాగ కార్యదర్శి ఇక్బాల్, రైతు విభాగ కార్యదర్శి చెన్నాబోయిన సుబ్బారావు, కల్చరల్ విభాగ కార్యవర్గ సభ్యులు కుందూరు ముకుంద రెడ్డి, మైనార్టీ విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన షేక్ మెహబూబ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు గొదావరి గంగ, ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, యలకల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి నిమజ్జనోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కొత్తపేట కోమలవిలాస్ సెంటర్‌లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ 53వ డివిజన్ అధ్యక్షుడు గురుమహంతు మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి చవితి వేడుకల్లో భాగంగా నిమజ్జనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. నిమజ్జన ఊరేగింపు ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మీ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. తొలుత అత్యంత సుందరంగా అలంకరించిన వాహనంపై గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, ఉత్సవ కమిటీ సభ్యులు నాగోతి చంద్రశేఖర్, టి.భరత్. బి.రమేష్, పోతిన శ్రీనివాస్, బాయన కుమార్, గుగ్గిల మణికంఠ, ఆర్.శంకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నగరాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలువురికి సత్కారం



నగరాల కార్పొరేషన్ చైర్మన్ తిరుమలేష్ దంపతులను సత్కరిస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు, అతిథులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):నగరాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం పలువురిని సత్కరించారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో ఆదివారం సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. సభకు రాయన ఆదిబాబు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎంపీ కేశినేని చిన్ని, గౌరవ అతిథులుగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పోతిన మహేష్, బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, ఎంఎస్.బేగ్, ప్రత్తిపాటి శ్రీధర్ హాజరయ్యారు. నగరాల కార్పొరేషన్ చైర్మన్ మరుపిల్ల తిరుమలేష్ దంపతులు, ఆక్వా డెవిల్స్ అధ్యక్షులు లింగిపిల్ల రామకృష్ణ, ప్రముఖ వ్యాపారవేత్త మజ్జి కిశోర్‌లను శాలువాలతో సత్కరించారు. నగరాల సామాజిక వర్గం చేస్తున్న సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమాన్ని సంఘ కార్యదర్శి తమ్మిన హేమంత్ కుమార్, పిళ్లా శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. లింగిపిల్ల అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావు, బెవర సూర్యనారాయణ, నల్లాని సూర్యారావు, ఎన్వీ.రావు, బాయన శేఖరబాబు, మజ్జి శ్రీనివాసరావులతో పాటు పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు శాపంగా రీ వెరిఫికేషన్

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం మాజీ అధ్యక్షుడు కిరణ్ రాజ్



భవానీపురం(విజయవాడపశ్చిమ):గత కొన్నేళ్లుగా 90 -100 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియ వారిపాలిట శాపంగా మారిందని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రీ వెరిఫికేషన్‌లో చాలా మంది వికలాంగుల వైకల్య శాతం భారీగా తగ్గించేస్తున్నారని, తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వికలాంగులకు రూ.1.07 లక్షల విలువైన త్రీ వీలర్ స్కూటీలను త్వరలో పంపిణీ చేయనున్న సందర్భంగా వైకల్యం 70 శాతం కన్నా ఎక్కువ ఉండాలన్న నిబంధన విధించడం వలన అర్హులైన వికలాంగులు వాటికి దరఖాస్తు చేసుకునే అవకాశం కోల్పోతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా డీఎస్సీకి క్వాలిఫై అయ్యి కూడా అనేక మంది దివ్యాంగులకు రీ వెరిఫికేషన్ ప్రక్రియలో పర్సంటేజ్ తక్కువ రావడంతో వాటిని కూడా కోల్పోయే దుస్థితి దాపురించిందని తెలిపారు. అంతే కాకుండా అక్టోబర్ నెల నుంచి పంపిణీ చేయనున్న పింఛన్ల విషయంలో ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం దివ్యాంగులను రాజకీయపరంగా చూడటం దుర్మార్గమని పేర్కొన్నారు. వైకల్యాల శాతాలపై తప్పుడు నివేదికలు ఇచ్చిన వైద్యులపై 2016 వికలాంగుల హక్కుల చట్టం ద్వారా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): షాపులో పనికి వెళ్లిన కుమార్తె ఇంటికి తిరిగి రాలేదని తల్లి చేసిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. శాంతినగర్‌కు చెందిన చింతలచెరువు లక్ష్మికి ఇద్దరు కుమార్తెలు. భర్త చనిపోయాడు. లక్ష్మి పెద్దకుమార్తె ప్రకాష్‌నగర్‌లోని ఓ మొబైల్ షాపులో పనిచేస్తుంది. ఈ నెల ఆరవ తేదీన యథావిధిగా షాపులో పనికి వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చక్రవర్తి సేవలు అపూర్వం



రక్తదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):బ్యాంకు ఎంప్లాయీస్ ఉద్యమ నేత తారకేశ్వర చక్రవర్తి ట్రేడ్ యూనియన్ రంగాలకు అందించిన సేవలు అపూర్వమని పలువురు వక్తలు పేర్కొన్నారు. చక్రవర్తి శత జయంతి వేడుకల్లో భాగంగా కృష్ణా జిల్లా బ్యాంక్ ఉద్యోగుల కో-ఆర్డినేషన్ కమిటీ రక్తదాన శిబిరాన్ని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం మాట్లాడుతూ ఏఐబీఈఏను ప్రారంభించి తారకేశ్వర చక్రవర్తి బ్యాంకు ఉద్యోగుల హక్కుల కోసం ఏవిధంగా పాటుపడినది వివరించారు. ఎన్నో లక్షల మందికి బ్యాంకు ఉద్యోగ సాధనలో ఆయన చూపిన పోరాట పటిమ అపూర్వమని కొనియాడారు. తారకేశ్వర చక్రవర్తి అందించిన స్ఫూర్తిని కొనసాగించే దిశగా బ్యాంకు ఉద్యోగులు పాటుపడాలని సూచించారు. అనంతరం ఉద్యోగుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘాల నేతలు బీఎస్ రాంబాబు, పీవీ కృష్ణారావు, టి.రవీంద్రనాథ్, ఎస్.సుబ్బారావు, కె.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టెలీస్కోప్‌లో వీక్షిస్తున్న సందర్శకులు







నిరాశ చెందిన గ్రహణ సందర్శకులు

చంద్రగ్రహణాన్ని చూడటానికి వచ్చిన సందర్శకులు మేఘాల కారణంగా తీవ్ర నిరాశకు గురయ్యారు. చంద్రగ్రహణం సందర్భంగా గాంధీహిల్ ఫౌండేషన్, జనవిజ్ఞానవేదిక, విజయవాడ స్కై వాచర్స్ సంయుక్తంగా గ్రహణాన్ని వీక్షించేందుకు గాంధీహిల్ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాట్లు చేసింది. ఆదివారం రాత్రి తొమ్మిది గంటల నుంచి గ్రహణాన్ని తిలకించేందుకు పలువురు సందర్శకులు హాజరయ్యారు. అయితే మేఘాల కారణంగా గ్రహాన్ని వీక్షించటానికి అవకాశం కలగలేదు. కొద్దిసేపు ఎదురు చూసిన సందర్శకులు మేఘాలు తొలగటకపోవటంతో నిరాశతో వెనుతిరిగారు.

–వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఎ.సీతారామపురంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న జూదశిబిరంపై వీరవల్లి పోలీసులు ఆదివారం దాడి చేశారు. జూదశిబిరం నిర్వహణపై విశ్వసనీయ సమాచారం అందటంతో వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.26,530 నగదు సీజ్ చేశారు.